# సింగిల్ పేజి కథలు

## కనువిప్పు

నిర్మలంగా ఉన్న ఆకాశంలో మేఘాలు ముసురుతున్నాయి తన మనసులోని ఆలోచనలల్లాగే. నిండు చంద్రుని మేఘాలు కప్పినపుడు నీడలా చీకటి అలుముకుంటుంది మనసులోని దుఃఖచ్ఛాయలా. మేఘాలు తొలగగానే పరుచుకుంటున్న వెన్నెల వెలుగు తోంది ఆనందపుకాంతిలా. వెన్నెల, చీకట్లు దొంగాటాడుతున్నాయా? అన్నట్లున్న వాతావరణంలాగానే తన మనసులోనూ సంతోష విచారాలు దోబూచులాడుతున్నాయి. ఎంత వద్దనుకున్నా మనసులో ముసురుతున్న ఆలోచనలు పోవటం లేదు. పదే పదే తను విన్న మరదళ్ల సంభాషణే చెవుల్లో మారు మ్రోగుతుంది.

ఇన్ని రోజులూ "బావగారూ! మీరే మా దేవుడు" అన్న మరదళ్లు ఈ రోజున ఇలా మాట్లాడారేంటి? తన చెవులారా తను విన్నాడు కనుక నమ్మగలుగుతున్నాడు. లేకపోతే వేరే ఎవరైనా చెబితే నమ్మేవాడా? వేరే ఎవరైనా ఎందుకు కట్టుకున్న భార్య తమ్ముళ్ల గురించి చెడుగా మాట్లాడినందుకు ఆమెనే కాదనుకున్నాడు. ఎవరి కోసమైతే భార్యను కాదనుకున్నాడో ఆ తమ్ముళ్లు, వారి భార్యలే ఈ రోజు ఇంత అమర్యాదగా మాట్లాడుతున్నారు. తన సంపాదన మీదే నిన్నమొన్నటి వరకు ఆధారపడినవాళ్లు, సంపాదించినదంతా వాళ్లకిస్తుంటే దేవుడిలా చూసినవాళ్లు ఈ రోజు ఆరోగ్యం సరిలేక ఒక నెల రోజులు మంచంలో ఉండేసరికి, జీతం రాని కారణంగా ఎన్ని మాటలంటున్నారు వెనుకబాటుగా. ఈ రోజు వెనుకబాటుగా అన్నారు. రేపు ముఖానే అనరనేముంది.

ఏక్సిడెంట్ రూపంలో ఆ భగవంతుడు తన కళ్లు తెరిపించాడు. ఆ ఏక్సిడెంట్‌లో కాలు విరగకున్నట్లయితే వీళ్ల అసలు నైజం తనకు తెలిసేది కాదు. చిన్నతనంలోనే తల్లీతండ్రీ మనస్పర్థల కారణంగా ఆత్మహత్య చేసుకొని తమ ముగ్గురుని అనాథలని చేశారు. సమస్యలొస్తే పరిష్కరించుకోకుండా తమ మరణంతో ఒకరినొకరు సాధిద్దామనుకొని ఇద్దరూ చనిపోయారు. తనకప్పుడు 16 సంవత్సరాలు. చదువంటే ఎంతో ఇష్టం. సంగీతం నేర్చుకుంటుండేవాడు. అప్పుడే చిన్న చిన్న



బాలల కథలు, గేయాలు రాస్తుండేవాడు. తల్లీతండ్రి మరణంతో వాటన్నిటికి స్వస్తి చెప్పి ఒక హోటల్‌లో సర్వర్‌గా చేరాడు. 10 సంవత్సరాలు, 7 సంవత్సరాలు వయసులో ఉన్న తమ్ముళ్లకి తానే తల్లీతండ్రి అయి పెంచాడు. తాను కష్టపడుతూ తనకిష్టమైన చదువు వాళ్లు చదువుకొనేలా చేశాడు. ఒకరు టీచర్‌గా, ఒకరు బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగాలు సంపాదించారు. ఉద్యోగాలు రాకముందే ప్రేమించామంటూ పెళ్లిళ్లు చేసుకున్నారు. తమ వాళ్లను కాదనలేక పోయాడు. ఎందుకంటే తనది ప్రేమవివాహమే కనుక. ఏరికోరి ఎవరూ లేని పేదపిల్లని ప్రేమించి మరీ పెళ్లి చేసుకున్నాడు. తన తమ్ముళ్లని ప్రేమగా చూసుకుంటుందని. ఆమె బంధువులు ఎవరైనా ఉంటే మరుదలని చూసేదేంటి, నీ సుఖం నువ్వు చూసుకోక అంటూ ఎక్కడ బోధచేసి భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తెస్తారేమో అనే భయంతో. ఆ భయానికి కారణం తన తల్లిదండ్రుల మధ్య వచ్చిన మనస్పర్థలకి బంధువులే కారకులవ్వటమే. అదే మదిలో ఉండటం వలన అనాథ పిల్లని పెళ్లాడాడు. ఆమె ఎంతో మంచిది. మరుదులని సొంత బిడ్డలుగా చూసుకొనేది. వారు ఆమెని అంతగా గౌరవించేవారు. కానీ వారి భార్యల మాటల ప్రభావం వలన పెళ్లిలైన తర్వాత ఆ గౌరవం తగ్గుతూ వచ్చింది. ఉద్యోగాలు సంపాదించిన తమ్ముళ్లు ఏనాడు ఇంటి ఖర్చులకని డబ్బులు ఇవ్వలేదు. తను అడగనూ లేదు. కానీ తనొక్కడే కష్టపడటం సహించలేని తన భార్య మాత్రం తనను అడగమని వత్తిడి తేవటం మొదలుపెట్టింది. తమ మధ్య గొడవలు మొదలయ్యాయి. తను ఆమెను సమర్థించలేకపోయాడు. దానికి కారణం భార్యపై కన్నా తమ్ముళ్లపైనున్న ప్రేమ అధికమవ్వటమే. తమ్ముళ్లు తమ భార్యలకు నగలు చేయించటం, స్థలాలు కొనటం వంటివి చూసిన ఆమె సహజంగానే సహించలేకపోయింది. ఈసారి గొడవ తను ఆమెపై చెయ్యిచేసుకునేంత తీవ్రస్థాయికి చేరడంతో "నా విలువ నీకు తెలిసినప్పుడే వస్తానంటూ" తనను, ఇంటిని వదిలి వెళ్లిపోయింది. తన అహంకారం ఆమెను ఆపుదామన్న మనసులోని కోరికను అణచివేసింది. ఆమె లేని లోటు తనకు తెలియలేదు. తమ్ముళ్ల సంతోషమే తనకు మోదం కనుక. ఈ రోజు మాత్రం తన భార్య మాటలలోని యదార్థం బోధపడుతుంది కొంచెంకొంచెంగా. ఎక్కడికెళ్లిందో, ఎలా ఉందో? ఒక్క రోజైనా ఆమె గురించి ఆలోచించాడా తాను. తమ్ముళ్లపైనున్న మమకారం తనను అంధుడ్ని చేసింది. తన వాళ్లంటూ ఎవరూ లేని ఆమె ఎన్ని వెతలు పడుతుందో? ఏదో ఒకటి చెయ్యాలి? చిన్నగా కర్రసాయంతో బయట పడ్డాడు. హోటల్ వైపు దారి తీశాడు.

హోటల్ యజమాని ఎంతో మంచివాడు. ఇన్ని

సంవత్సరాలు ఎంతో నమ్మకంగా పనిచేయటం వలన తననే క్యాషియర్‌ని చేశాడు. అతనింకో పెద్ద హోటల్ పెట్టడం వలన దానిని తను చూసుకుంటూ ఈ హోటల్ బాధ్యతంతా తనకే అప్పజెప్పాడు. తమ్ముళ్ల విషయంలో తన నమ్మకం వమ్ము అయినా యజమాని విషయంలో మాత్రం వమ్ముకాలేదు. యజమాని తనను చూడగానే ఆప్యాయంగా పలకరించాడు. ఇంకో నెల విశ్రాంతి తీసుకొనమని పదివేల రూపాయలివ్వటమే గాక ఖాళీగా ఉన్న తమ ఇంటి ఒక పోర్షన్‌లో ఉండమన్నాడు. 'నీ విషయాలన్నీ ఎప్పటికప్పుడు నాకు తెలుస్తూనే ఉన్నాయి. కానీ నీ వ్యక్తిగత విషయాలలో తలదూర్చటం సభ్యతనిపించుకోదు కనుక నీ భార్య నిన్ను వదిలిపోయినప్పుడే నిన్ను మందలించుదామన్న ఆలోచనను విరమించుకున్నాను. అప్పుడు నువ్వు పొరపాటు చేశావు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ భార్యను చేరదీయి. ఆమెని ఆదరించు' అన్న మాటలకు తన కళ్లల్లో నీళ్లే సమాధానమయ్యాయి.

"నువ్వేం బాధపడకు. నీ భార్య ఎక్కడుందో అనేగా నీ దిగులు. ఆమె ఆ రోజు నేరుగా నా దగ్గరకే వచ్చింది. నీ అంతట నీవు ఆమెను కోరుకునే వరకు నన్ను ఆ ప్రస్థావన తేవద్దంది. మీరిద్దరూ ఎంతో మంచివాళ్లు. పట్టుదలలు మాని ఇకనైనా సంతోషంగా ఉండండి. వేరెవరి కోసమో మీరిద్దరూ విడిపోవటం సమంజసం కాదు" అన్నాడు.

తనసుండమన్న ఇంటి వాకిటిలోనే తన భార్య కనిపించింది. ఇద్దరికి ఒకరినొకరు చూసిన ఆనందంలో మాటలు కరువయ్యాయి. క్షమించమని కళ్లతోనే అడిగాడు. ఆమె ఆనందంగా అతనికి ఆసరా అయి లోనికి నడిపించింది.


'హోటల్ యజమాని ఈ హోటల్ నువ్వు కొనుక్కో. అవసరమైన ధనం బ్యాంకు లోను నుంచి పొందవచ్చని' బ్యాంకు లోన్ ఇప్పించాడు. ఆ హోటల్ త్వరగానే తన సొంతమయ్యింది. భార్య, హోటల్ తన లోకమయ్యాయి. చిన్ననాడు ఆశపడిన సంగీత, సాహిత్యాలకు తన జీవితంలో స్థానం కల్పించాలని ఆశించి భార్య సలహాతో ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి అందులో ఒక భాగంలో 'కవికోకిల' అనే సాహిత్య పత్రికను ప్రారంభించాడు. సంగీత సాహిత్యాల వలె ఆ దంపతులిరువురు తమ కలలను సాకారం చేసుకున్నారు.

**-ఇరపని మాధవి** (గుంటూరు)

★ ★ ★

# ఊరు రమ్మంటోంది

**విశాలమైన భవంతిలో దూదిపింజ లాంటి పరుపుమీద పడుకున్న పరంధామయ్య ఏదో ఆలోచిస్తున్నాడు. అంత విశాలమైన ఆ భవనం స్వర్గాన్ని తలపించే అధునాతన వసతులు అన్నీ అతనికి బంధనాలుగానే అగుపిస్తున్నాయి. మెత్తటి పరుపు ముళ్లపొదై తన శరీరంలో అణువణువులోకి గుచ్చుకుపోతున్నట్లుగా ఉంది. ఇది ఈ రోజు, నిన్నా కాదు. దాదాపు నెల రోజుల నుండి తన మనసులో రేగుతున్న అలజడి. అసంతృప్తి.**



ఏమండీ... ఇంకా నిద్రపట్టలేదా? అన్న భార్య మాటలకు ఆలోచనాస్రవంతి నుండి బయటకొచ్చాడు. లేదు జానకి. అన్నాడు ముభావంగా.

ఆమెకు తెలుసు అతనిలోని అశాంతికి కారణం.నెల రోజుల క్రితం తనకు ఇష్టం లేకున్నా సరే కొడుకుతో కలిసి పట్టుబట్టి మరీ తనను అమెరికాకు తీసుకొచ్చింది తను.

నాలుగు రోజుల పాటు కొడుకు హాయిగా కారులో ఊరంతా తిప్పి ఇలా నాలుగు గోడల స్వర్గమనబడే దాంట్లో బంధించాడు వాళ్లను.

పరంధామయ్యది తూర్పు గోదావరి జిల్లాలోని చిన్న పల్లెటూరు. వయసు అరవై దాటింది. ఊహ తెలిసిననాటి నుండి వ్యవసాయమే చేస్తూ తన భార్యాపిల్లలని పోషించాడు. ఉన్నంతలోనే కొడుకును బాగా చదివించి అమెరికాకు పంపాడు.

తండ్రి చిన్నప్పటి నుండి పడిన కష్టం చూడలేక కొడుకు శ్రీధర్ తల్లీతండ్రులని తన వద్దకు తెచ్చుకున్నాడు వాళ్లను ఇకనైనా సుఖపెట్టలనే ఆశతో.

అతనికి రోజులు యుగాలుగా గడుస్తున్నాయి. మాట్లాడ్డానికి అక్కడ మనుషుల్లేరు. పలకరించాలన్నా భాష రాదు. బయటకెళ్దామంటే దిక్కూ తెలీదు. కాలు కాలిన పిల్లిలా ఇంట్లో నాలుగు గోడల మధ్య కాలక్షేపం చేస్తున్నాడు నెలరోజులుగా.

తన ఊర్లో పొలాలు, ఆవులు, గేదెలు గుర్తొచ్చాయతనికి. తన ఊరి మట్టి, గాలి, ఆ మనుషులు, ఆ వాతావరణం అన్నీ తన రాకకై ఎదురుచూస్తున్నట్లనిపించింది. తన పలకరింపు కోసం వెయ్యి కళ్లతో నిరీక్షిస్తున్నట్లనిపించింది.

అన్నిటికన్నా తన ఇంట్లో దక్షిణ పక్క గదిలో పైకప్పు చూరు నుండి వర్షాకాలంలో టప్‌టప్‌మని కారే నీటి చుక్క గుర్తొచ్చింది. ఇప్పుడు తను లేక ఆ గది బోసిపోయిందేమో అనిపిస్తుందతనికి. చూరు నుండి కారే చినుకు చినుకు కన్నీరై బోరున విలపిస్తున్నట్లనిపించిందతనికి.

అదే అలవాటుగా పరుపుపై పడుకుని అందమైన రూఫ్‌కేసి చూస్తున్నాడు తదేకంగా పరంధామయ్య. నిద్ర వస్తుందా లేక, తన ఇంట్లో మాదిరే ఈ రూఫ్ కూడా ఎప్పటికైనా కారకపోతుందా అని ఆశగా.

అక్కడ ఇమడలేకపోతున్న పరంధామయ్యను ఊరు రమ్మంటోంది.

**-ఎస్.శేషగిరి** (హైదరాబాద్)